షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
RNI : APTEL / 2023 / 89152
1st Year Happy Work Anniversary.
Good for Health
Best for Readers
సంపుటి : 3 సంచిక : 117
ఆదివారం 03 మే 2026 పేజీలు 8 వెల : రూ.3
Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.

# సింగపూర్ పర్యటనకు ఏపీ బెస్ట్ టీచర్లు...

## మంత్రి నారా లోకేష్ స్పందన



●శిక్షణ కోసం సింగపూర్‌కు 37 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు ● నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సింగపూర్‌లో 5 రోజుల ప్రత్యేక కార్యక్రమం ● ఆధునిక బోధన పద్ధతులపై టీచర్లకు శిక్షణ ఉపాధ్యాయులు ● అభివృద్ధి చెందితే తరగతి గది మారుతుందన్న మంత్రి లోకేష్

(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 02)

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ పాఠశాలల విద్యా ప్రమాణాలను మెరుగుపరిచే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన 37 మంది ఉత్తమ ప్రభుత్వ ఉపాధ్యాయులను ప్రత్యేక శిక్షణ కోసం సింగపూర్‌కు పంపింది. ఈ బృందం సింగపూర్ పర్యటనకు వెళ్లడం పట్ల విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో భాగంగా ఉపాధ్యాయులు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సింగపూర్‌లో ఐదు రోజుల పాటు జరిగే ప్రత్యేక శిక్షణా కార్యక్రమంలో పాల్గొంటారు. ఆధునిక బోధన పద్ధతులు, విద్యార్థుల్లో విమర్శనాత్మక ఆలోచనను (క్రిటికల్ థింకింగ్) పెంపొందించడం, విద్యార్థి కేంద్రిత బోధన వంటి అంశాలపై వీరికి లోతైన అవగాహన కల్పించనున్నారు. ప్రపంచ స్థాయి ఉత్తమ విద్యా విధానాలను నేర్చుకుని, వాటిని రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేయడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని మంత్రి లోకేష్ వివరించారు."ఉపాధ్యాయులు అభివృద్ధి చెందితేనే తరగతి గది రూపాంతరం చెందుతుంది" అనే బలమైన ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని ఆయన తెలిపారు. ఈ అంతర్జాతీయ శిక్షణ ద్వారా ఉపాధ్యాయుల నైపుణ్యాలు మెరుగుపడి, రాష్ట్ర విద్యా వ్యవస్థ మరింత ఉన్నత స్థాయికి చేరుకుంటుందని లోకేష్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## చంద్రబాబుకు అమరావతిపై ఉన్న ప్రేమ ప్రజలపై లేదు విడదల రజిని

కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తగా ఒక్క పెన్షన్ కూడా ఇవ్వలేదన్న రజిని
అమరావతి నిర్మాణం పేరుతో పెద్ద ఎత్తున దోపిడీ జరుగుతోందని ఆరోపణ



(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 02)

కూటమి ప్రభుత్వంపై వైసీపీ నాయకురాలు, మాజీ మంత్రి విడదల రజని నిప్పులు చెరిగారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకి అమరావతిలోని అద్దాల మేడలపై ఉన్న ప్రేమ సామాన్య ప్రజలపై లేదని ఆమె మండిపడ్డారు. అధికారంలోకి వచ్చాక కనీసం ఒక్క కొత్త పెన్షన్ అయినా ఇచ్చారా అని ప్రశ్నించిన ఆమె, జగన్ హయాంలో 66 లక్షలకు పైగా ఉన్న పెన్షన్లలో ఇప్పుడు ఏకంగా 6 లక్షల పెన్షన్లను కట్ చేశారని ఆరోపించారు. 50 ఏళ్లు దాటిన వారికి పెన్షన్ ఇస్తామన్న హామీని కూడా గాలికి వదిలేశారని విమర్శించారు.ఒకవైపు రికార్డు స్థాయిలో అప్పులు చేస్తూ, ఆ నిధులను చంద్రబాబు, పవన్ కల్యాణ్, నారా లోకేశ్ తమ విలాసాల కోసం, ప్రత్యేక విమానాలు, హెలికాప్టర్ల ప్రయాణాల కోసం వృథా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతి నిర్మాణాల పేరుతో పెద్ద ఎత్తున దోపిడీ జరుగుతోందని, అడుగుకు రూ.18,500 పైనే ఖర్చు చేయడం దేశంలో ఎక్కడా లేని విడ్డూరమని రజిని పేర్కొన్నారు.

కేవలం అక్కడ అద్దాల కోసమే రూ.2,500 కోట్లు ఖర్చు చేసే బదులు, ఆ నిధులతో మెడికల్ కాలేజీలు పూర్తి చేయవచ్చని, ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించవచ్చని ఆమె సూచించారు. ఆరోగ్యశ్రీకి రూ.4 వేల కోట్ల బకాయిలు పెట్టి సామాన్యుడి వైద్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని, దీనిపై ప్రశ్నిస్తే అమరావతికి వ్యతిరేకం అంటూ విష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. జగన్ పాలనలో అన్ని వర్గాలకు మేలు జరిగిందని అన్నారు.

## మరింత కచ్చిత వాతావరణ సమాచారానికి విస్తృత పరిశోధన



కేంద్ర భూవిజ్ఞానశాఖ కార్యదర్శి రవిచంద్రన్
ఏయూలో అత్యాధునిక పరిశోధన, పరీక్ష కేంద్రం ప్రారంభం
శిలాఫలక ఆవిష్కరణలో రవిచంద్రన్ తదితరులు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 02)

మరింత లోతైన, కచ్చితమైన సమాచారం నిమిత్తం ఏయూ కేంద్రంగా తీర ప్రాంత వాతావరణ పరిశోధన, పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు కేంద్ర భూవిజ్ఞాన శాఖ కార్యదర్శి రవిచంద్రన్ తెలిపారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటియరాలజీ (ఐఐటీఎం-పుణె) ఆధ్వర్యంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం (ఏయూ)లో 'ఓపెన్ ఫీల్డ్ అబ్జర్వేటరీ ఆఫ్ కోస్టల్ అట్మాస్పియరిక్ రీసెర్చ్ టెస్ట్ బెడ్ (సి-కార్ట్)'ను వీసీ రాజశేఖర్‌తో కలిసి శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. 'ఈ పరీక్ష కేంద్రం ద్వారా వచ్చే సమాచారాన్ని సాంకేతికంగా పరిశోధించి మెరుగైన వాతావరణ సమాచారం ▶మిగతా 2లో

## అమరావతి నిర్మాణ ఖర్చుపై వైకాపా దుష్ప్రచారం



(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 02)

"వైకాపా ప్రభుత్వంలో విశాఖ రుషికొండ మీద 1.40 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో మీకోసం విలాసవంతమైన ప్యాలెస్ కట్టుకున్నారు. అందుకు చదరపు అడుగుకు రూ.35,714 చొప్పున ఖర్చుపెట్టారు. మీ రాజభోగం కోసం రూ.700 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారు. అలాంటి మీకు ప్రజా రాజధాని నిర్మాణానికి చదరపు అడుగుకు రూ.6,980 వెచ్చిస్తే అభ్యంతరమేంటి?" అని వైకాపా అధినేత జగన్‌ను ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్ ప్రశ్నించారు. మీరేమో ప్రజాధనంతో రాజభవనాలు కట్టుకోవచ్చు, ప్రజల కోసం ఖర్చుచేస్తే అవినీతి కనిపించిందా? అని ధ్వజమెత్తారు. అమరావతి నిర్మాణానికి చ.అడుగుకు ఖర్చు రూ.12వేలని ఓసారి, రూ.14వేలని మరోసారి వైకాపా నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శుక్రవారం షరీఫ్ విలేకర్లతో మాట్లాడారు. 2021-22లో పూర్తయిన తెలంగాణ సచివాలయ నిర్మాణానికి చ.అడుగుకు రూ.6,500 చొప్పున ఖర్చుచేశారని గుర్తుచేశారు. "అప్పటి కంటే ఇప్పుడు నిర్మాణసామగ్రి ధరలు, ఖర్చులు బాగా పెరిగాయి. అయినా.. ఏపీ ప్రభుత్వం చ.అడుగుకు రూ.6,980 చెల్లిస్తోంది. తెలంగాణ విషయంలో లేని అభ్యంతరం...అమరావతి విషయంలోనే ఎందుకొచ్చింది? ఇది అమరావతిని అడ్డుకోవాలనే కుట్రలో భాగం కాదా?" అని జగన్‌ను ప్రశ్నించారు. ▶మిగతా 2లో

## ఆర్టీసీ సిబ్బంది గొడవలు పెట్టుకోవద్దు



పొన్నం ప్రభాకర్ హితవు
అధికారులు డ్రైవర్లు, కండక్టర్ల పట్ల దురుసుగా ప్రవర్తించవద్దని సూచన
ప్రయాణికులతో సత్సంబంధాలు కలిగి ఉండాలన్నమంత్రి
నష్టాల్లో ఉన్న డిపోలు సమీక్షించుకోవాలన్న మంత్రి

(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 02)

ఆర్టీసీ సిబ్బంది గొడవలు పెట్టుకోవడం సరికాదని తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. ఆర్టీసీ అధికారులు కూడా కిందిస్థాయి డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది పట్ల దురుసుగా ప్రవర్తించవద్దని అన్నారు. స్నేహపూర్వకంగా ఉండి వారితో పనిచేయించుకోవాలని తెలిపారు. ఆర్టీసీ ఉన్నతాధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, డిపో మేనేజర్లు, ఆర్టీసీ సిబ్బంది

## లోకేశ్ పై వెంకయ్యనాయుడు ప్రశంసలు



పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ఘనతను ప్రశంసించిన వెంకయ్యనాయుడు
లోకేశ్ తీసుకుంటున్న చర్యలు బాగున్నాయని ప్రశంస

(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 02)

తల్లిదండ్రులు పిల్లలకు సమయం కేటాయించడం లేదని ఆవేదన ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పనితీరుపై భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ప్రశంసల జల్లు కురిపించారు. నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం ▶మిగతా 2లో

## హర్మ్యూజ్‌పై నియంత్రణ.. ఇరాన్ కీలక ప్రకటన



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, మే 02)

పర్షియన్ గల్ఫ్, హర్మ్యూజ్ జలసంధి విషయంలో కొత్త అధ్యాయం మొదలుకానుందని ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఐఆర్‌జీసీ నౌకాదళం కీలక ప్రకటన చేసింది. పర్షియన్ గల్ఫ్, హర్మ్యూజ్ జలసంధి (క్రాతీఖుత్ శీట ఎశీతీఎబఓ)లోని కీలక సముద్ర మార్గాలపై తమ నియంత్రణను బలోపేతం చేయాలనుకుంటున్నట్లు తెలిపింది. దీనికి ▶మిగతా 2లో





## ఈ అద్భుత ఘనకార్యానికి గుర్తుగా దేశంలోని మ్యూజియంలలో మోదీ పేరును సువర్ణాక్షరాలతో రాయించాలి: షర్మిల

(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 02)

వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరలను భారీగా పెంచడంపై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, కేంద్ర ప్రభుత్వం మరియు ప్రధాని నరేంద్ర మోదీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఓట్ల కోసం వేషాలు కట్టి, ఎన్నికలు ముగిసిన వెంటనే ప్రజలపై 'బండ బాదుడు' మోపడం మోదీకి అలవాటుగా మారిందని ఆమె ఘాటుగా విమర్శించారు.ఐదు రాష్ట్రాల ఎన్నికల తర్వాత కేంద్రం ఇచ్చిన అతిపెద్ద గిఫ్ట్ ఈ ధరల పెంపేనని షర్మిల ఎద్దేవా చేశారు. వాణిజ్య గ్యాస్ సిలిండర్‌పై ఒకేసారి రూ. 993, 5 కిలోల సిలిండర్‌పై ▶మిగతా 2లో

## ఆహారంపైనా యుద్ధమిది.. ప్రమాదంలో వెయ్యి కోట్ల భోజనాలు



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, మే 02)

హర్మ్యూజ్ జలసంధి మూతపడటంతో చమురే కాకుండా ఎరువుల సరఫరాపైనా పెను ప్రభావం చూపుతోంది. ప్రపంచవ్యాప్తంగా జరిగే ఎరువుల వ్యాపారంలో (యూరియా, పొటాష్, అమ్మోనియా, ఫాస్ఫేట్) మూడింట ఒక వంతు ఈ మార్గం నుంచే జరుగుతోంది. ఇప్పుడు ఈ మార్గం మూసుకుపోవడంతో రానున్న రోజుల్లో ఆహార ఉత్పత్తి గణనీయంగా పడిపోనుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

ఇరాన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత ఎరువుల ధరలు 80 శాతం వరకు పెరిగాయి. ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితులిలానే కొనసాగితే రానున్న రోజుల్లో ప్రపంచ ఆహార భద్రతకు పెనుముప్పు వాటిల్లే అవకాశాలున్నాయి. తత్ఫలితంగా వారానికి దాదాపు 1000 కోట్ల భోజనాల(మీల్స్)కు ముప్పు తప్పదని, నిరుపేద దేశాలకు ఇది శరాఘాతమేనని ప్రపంచ ప్రఖ్యాత ఎరువుల కంపెనీల అధిపతుల్లో ఒకరైన స్వెన్ టోర్ హాల్‌సెథర్ హెచ్చరిస్తున్నారు. ఎరువుల రవాణాను ఆపేయడమంటే ఒకరకంగా ఆహారంపై యుద్ధం ప్రకటించడమేనని, ▶మిగతా 2లో

## మొదటిపేజీ తరువాయి

### లోకేశ్ పై వెంకయ్యనాయుడు ప్రశంసలు

గొలగమూడిలో ఈరోజు పర్యటించిన ఆయన, శ్రీ భగవాన్ వెంకయ్యస్వామి జీవిత చరిత్ర 'విశ్వంభరుడు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్య, కుటుంబం మరియు సామాజిక విలువలపై ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర విద్యాశాఖలో వస్తున్న మార్పులను వెంకయ్యనాయుడు ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సాధించిన ఘనతను ఆయన కొనియాడారు. విద్యాశాఖ మంత్రిగా లోకేశ్ తీసుకుంటున్న చర్యలు బాగున్నాయని, మంచి పనులు చేసే వారిని ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని ఆయన సూచించారు. ఇక, "నా కుమారుడు హర్షవర్ధన్, కుమార్తె దీపా వెంకట్‌ల వ్యాపారాల్లో నేను జోక్యం చేసుకోను. నా రాజకీయాల్లోకి వారు రావొద్దు అని మా మధ్య ఒక గౌరవ ఒప్పందం ఉంది" అని ఆయన తెలిపారు. నేటి కాలంలో తల్లిదండ్రులు పిల్లలకు సమయాన్ని కేటాయించడం లేదని, టీవీలు, మొబైళ్లకే పరిమితం అవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలతో గడపడం ద్వారానే మంచి విలువలను అందించగలమని పేర్కొన్నారు.

ప్రస్తుత సమాజంలోని పరిస్థితులపై వెంకయ్యనాయుడు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. రోజూ పత్రికల్లో వస్తున్న కొన్ని వార్తలను చూస్తుంటే సిగ్గేస్తోందని, పాశ్చాత్య వ్యామోహంలో పడి మన సంస్కృతిని విస్మరిస్తున్నామని మండిపడ్డారు. సమాజం గతితప్పినప్పుడే యోగి భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి వంటి మహానుభావులు జన్మిస్తారని, ఆధ్యాత్మికత వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని చెప్పారు.

### మరింత కచ్చిత వాతావరణ సమాచారానికి విస్తృత పరిశోధన

అందించేందుకు వీలవుతుంది. ఏయూ వాతావరణ విభాగానికి ఐఐటీఎం ద్వారా పరిశోధనా నైపుణ్యం తోడవ్వడం గర్వకారణం. భవిష్యత్తులో ఈ భాగస్వామ్యం మరిన్ని గొప్ప ఆవిష్కరణలకు నాంది పలుకుతుంది' అని పేర్కొన్నారు. ఐఐటీఎం సంచాలకుడు డాక్టర్ సూర్యచంద్రరావు మాట్లాడుతూ.. 'ఆధునిక శాస్త్ర, సాంకేతికతతో వాతావరణాన్ని ముందుగానే అంచనా వేయడం, ప్రభావాలను తగ్గించడం లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇక్కడ ఏర్పాటు చేసిన పరికరాలు వాతావరణ పరిస్థితులను మరింత కచ్చితంగా అంచనా వేసేందుకు సహాయ పడతాయి. తుపాన్ల తీవ్రత అంచనా వేయడం మెరుగవ్వడంతో పాటు మత్స్యకారులు, రైతులు, విపత్తు నిర్వహణ సంస్థలకు ముందస్తు హెచ్చరికలివ్వడం సులువవుతుంది' అని అన్నారు. ఏయూ వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్ మాట్లాడుతూ.. ఇప్పటికే రూ.60 కోట్ల విలువైన పరికరాలు సమకూరాయని, ప్రాజెక్టు వేగంగా ముందుకు సాగుతోందన్నారు. కార్యక్రమంలో ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు, ఐఐటీఎం ప్రాజెక్టు డైరెక్టర్ పద్మకుమారి తదితరులు పాల్గొన్నారు.

### ఆర్టీసీ సిబ్బంది గొడవలు పెట్టుకోవద్దు

ప్రయాణికులతో సత్సంబంధాలు కలిగి ఉండాలని అన్నారు. ఖమ్మం, మెదక్, నారాయణఖేడ్, బాన్సువాడ, ఇల్లెందు లాంటి కొన్ని డిపోలు ఎందుకు నష్టాల్లో నడుస్తున్నాయో ఆర్ఎంలు, డిపో మేనేజర్‌లు సమీక్షించాలని ఆదేశించారు. ఆర్టీసీ యాజమాన్యం సిబ్బంది సమస్యలు సావధానంగా వినాలని సూచించారు. టిక్కెట్లకు సంబంధించి ఏదైనా ఇబ్బందులు, సమస్యలు ఏర్పడితే వెంటనే చర్యలు తీసుకోవాలని అన్నారు.

### అమరావతి నిర్మాణ ఖర్చుపై వైకాపా దుష్ప్రచారం

బూచిగా చూపే కుతంత్రం

"కూటమి ప్రభుత్వంలో అమరావతి నిర్మాణ పనులు అత్యంత పారదర్శకంగా, శరవేగంగా సాగుతున్నాయి. దీన్నిచూసి ఓర్వలేక వైకాపా నాయకులు అసత్యాలు మాట్లాడుతున్నారు. గతంలో మూడు రాజధానులని, ఇప్పుడు మావిగన్ అంటూ ప్రజల్ని గందరగోళానికి చేస్తున్నారు. రాజధాని మీద ఒక ప్రణాళికే లేని వైకాపాకు రాజకీయాల్లో కొనసాగే అర్హతే లేదు" అని ఎంఏ షరీఫ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంట్ కొత్త భవన నిర్మాణానికి రూ.1200 కోట్లు ఖర్చయితే...రూ.970 కోట్లు మాత్రమే అయ్యిందంటూ అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. అక్కడి ఖర్చును తక్కువ చేసి... అమరావతిని బూచిగా చూపే కుతంత్రంలో ఇదంతా భాగమని ధ్వజమెత్తారు.

రాజధాని అంటే రాష్ట్రాభివృద్ధికి గ్రోత్ ఇంజిన్

అమరావతి అంటే ఇటుకలు, సిమెంటు కాదని.... రాష్ట్రాభివృద్ధికి గ్రోత్ ఇంజిన్ అని షరీఫ్ స్పష్టం చేశారు. "ప్రభుత్వం వద్ద ఉన్న 5వేల ఎకరాల మిగులుభూమి విలువే రూ.లక్షల కోట్లు ఉంటుంది. వీటిద్వారా వచ్చే ఆదాయంతో రుణాలు తీర్చే వెసులుబాటు ఉంది. తెలంగాణలో హైదరాబాద్ నుంచే 70% ఆదాయం వస్తోంది. ఆ నిధులతోనే అన్ని నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. అమరావతి విషయంలోనూ భవిష్యత్తులో అదే జరుగుతుంది" అని షరీఫ్ పేర్కొన్నారు.

### హర్మూజ్‌పై నియంత్రణ.. ఇరాన్ కీలక ప్రకటన

సంబంధించిన సమీకరణాలు, నిబంధనలు సిద్ధమయ్యాయని.. సుప్రీం లీడర్ ఆదేశాలకు అనుగుణంగా అమలుచేస్తామని వెల్లడించింది. "పర్షియన్ గల్ఫ్, హర్మూజ్ జలసంధి వెంబడి దాదాపు 2,000 కి.మీ.మేర విస్తరించి ఉన్న ఇరాన్ తీరప్రాంతంపై మా నియంత్రణ కొనసాగేలా చూస్తాం. సుప్రీం లీడర్ ఆదేశాలకు అనుగుణంగా మా ప్రాదేశిక జలాలను.. ఇరాన్ ప్రజల శక్తిసామర్థ్యాలు, గొప్పతనానికి ప్రతీకగా, జీవనోపాధి, ప్రాంతీయ భద్రతకు ఆధారంగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం" అని ఐఆర్‌జీసీ నౌకాదళం ఓ ప్రకటన చేసినట్లు ఇరాన్ అధికారిక మీడియా 'ప్రెస్ టీవీ' తెలిపింది. మరోవైపు.. హర్మూజ్‌లో అమెరికా తన దిగ్బంధనాన్ని కొనసాగిస్తోంది. ఇప్పటివరకు 42 నౌకలను అడ్డుకున్నామని యూఎస్ సెంట్రల్ కమాండ్ వెల్లడించింది.

అలా చేయకుంటే.. పశ్చిమాసియా, ఐరోపా ముక్కలైపోయేవి: ట్రంప్

ఇటీవల పర్షియన్ గల్ఫ్ దినోత్సవం సందర్భంగా హర్మూజ్ జలసంధికి సంబంధించి ఇరాన్ సుప్రీం లీడర్ ఓ సమగ్ర వ్యూహాత్మక ప్రణాళికను ఆవిష్కరించారు. ఈ కీలక జలమార్గంపై ఇరాన్ అధికారం, నిర్వహణ అంశాలను అందులో ప్రస్తావించారు. జలసంధి నుంచి వచ్చే ఆదాయాన్ని ఇరాన్ రియాల్స్‌లో వసూలుచేయడం, ఇరాన్‌పై ఆంక్షలు విధించిన, దురాగతాలకు పాల్పడిన దేశాల నౌకలు పరిహారం చెల్లించేలా చూడటం, నౌకల రాకపోకలను సైనికులే నియంత్రించేలా చూడటం వంటివి ప్రణాళికలో ఉన్నాయి.

#### ఈ అద్భుత ఘనకార్యానికి గుర్తుగా దేశంలోని మ్యూజియంలలో మోదీ పేరును సువర్ణాక్షరాలతో రాయించాలి: షర్మిల

రూ. 549 పెంచిన ఘనత మోదీకే దక్కుతుందని ఆమె అన్నారు. కేవలం ఆరు నెలల్లోనే రూ. 1,513 పెంచడం దేశ చరిత్రలోనే ఇది తొలిసారి అని, ఈ ఏడాదిలోనే ధర 80 శాతం పెరిగిందని ఆరోపించారు. ఈ అద్భుత ఘనకార్యానికి గుర్తుగా దేశంలోని మ్యూజియంలలో మోదీ పేరును సువర్ణాక్షరాలతో రాయించాలని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఈ ధరల పెంపు సామాన్యులకు వాతలు పెట్టడమేనని, బయట తినేవారిపై పెనుభారంగా మారుతుందని షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. టీ స్టాల్స్, చిన్న హోటళ్లు నడుపుకునే వ్యాపారుల జీవితాలను అగమ్యగోచరంగా మార్చారని, విద్యార్థులు, వలస కార్మికుల నడ్డి విరిచారని విమర్శించారు. చమురు ధరలు తక్కువగా ఉన్నప్పుడు లాభాలు ఆర్జించిన కేంద్ర ప్రభుత్వం, ఇప్పుడు ధరలు పెరిగాయని ప్రజలపై భారం వేయడం ఎంతవరకు సమంజసమని ఆమె ప్రశ్నించారు. పెంచిన ధరలను తక్షణం ఉపసంహరించుకోవాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నట్లు షర్మిల స్పష్టం చేశారు.

### ఆహారంపైనా యుద్ధమిది.. ప్రమాదంలో వెయ్యి కోట్ల భోజనాలు

ధనిక, పేదల మధ్య మరింత అంతరాన్ని పెంచడమేనని 'యారా' ఎరువుల కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అయిన స్వీన్ అభిప్రాయపడ్డారు. సంపన్న దేశాల్లోనూ ఆహార ధరలు మండిపోవచ్చునని ఆయన 'బీబీసీ' ఇంటర్వ్యూలో చెప్పారు. ప్రస్తుత సంక్షోభ పరిస్థితుల్లో దాదాపు 5 లక్షల టన్నుల నత్రజని ఎరువును ఉత్పత్తి చేయలేకపోతున్నామని స్వీన్ వివరించారు. నత్రజని వేయకపోతే పంటకాలం తొలిసీజన్‌లో దాదాపు 50 శాతం దిగుబడి తగ్గిపోతుందని విశ్లేషించారు. ఆసియా, ఆగ్నేయాసియా, లాటిన్ అమెరికా, ఆఫ్రికా దేశాలు దీనివల్ల తీవ్రంగా నష్టపోతాయని చెప్పారు. వారానికి వెయ్యికోట్ల భోజనాల్ని ఉత్పత్తిచేయలేకపోతే పేద దేశాల్లో ఆహార సంక్షోభం తప్పదన్నారు. ఎరువులు ఎక్కువగా నిల్వచేసుకున్న దేశాలకు తాత్కాలికంగా ఉపశమనం కలిగినా.. యుద్ధం దీర్ఘకాలం కొనసాగితే వాటికీ ముప్పు తప్పదని సింగపూర్‌లో ఆహార భద్రత సీనియర్ పరిశోధకులు ప్రొఫెసర్ పాల్ తేంగ్ అభిప్రాయపడ్డారు.

### కంభం ప్రాంతంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టును ఏర్పాటు చేయాలి

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు పానుగంటి షాలేంరాజ్



(షణ్ముఖ వెలుగు, కంభం, మే 2)

గతంలో అర్ధవీడు కంభం బేస్తవారిపేట రాచర్ల గిద్దలూరు కొమరోలు మండలాలకు సంబంధించి తాలూకా కోర్టు ఈ ప్రాంతంలో ఉండేది. కొన్ని అనివార్య కారణాల దృష్ట్యా 1966 లో గిద్దలూరు ప్రాంతానికి మార్చడం జరిగింది. గిద్దలూరు సివిల్ జడ్జి కోర్టులో ప్రస్తుతం సుమారు 1100 కేసుల నుండి 1300 కేసుల వరకు పెండింగ్లో ఉన్నవి. అందులో అధిక శాతం కంభం బేస్తవారిపేట అర్ధవీడు మండలాలకు చెందినవే. భౌగోళిక సౌకర్యాల పరిస్థితుల దృశ్య అర్ధవీడు మండలం నుండి గిద్దలూరు ప్రాంతానికి వెళ్లాలంటే సుమారు 90 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి ఉంటుంది. పేద ప్రజలకు ప్రయాసతో అనేక ఇబ్బందులకు గురవుతున్న పరిస్థితి ప్రస్తుతం గిద్దలూరు నియోజకవర్గం లోని 6 మండలాల కక్షిదారులు సబ్ కోర్టుకు మార్కాపురం పోవలసి ఉంటుంది. మార్కాపురం సబ్ కోర్ట్ లో ఆరు మండలాలకు సంబంధించి దాదాపు 400 నుండి 500 కేసులు వరకు పెండింగ్లో ఉన్నవి. ఎక్కువ కేసులు లేని చోట కోర్టులను ఏర్పాటు చేయడం కన్నా ప్రస్తుతం కేసుల భారాన్ని తగ్గించడం కొరకు రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేస్తున్న అదనపు సివిల్ జడ్జి కోర్టును కంభం, అర్ధవీడు, బేస్తవారిపేట కేసుల సత్వర పరిష్కారం కొరకు కంభం నందు కొత్తగా నూతన అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టును ఏర్పాటు చేయాలని మార్కాపురం కోర్టు పరిశీలనకు వచ్చిన హైకోర్టు జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు కి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు పానుగంటి షాలేం రాజ్ కలిసి కంభం ప్రాంత ప్రజల సమస్యలను వివరించి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎమ్మార్పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ నేదరపల్లి జయరాజ్, ప్రభాస్, విజయ్, అనిల్, ప్రభాకర్, గాలేబు, తదితరులు పాల్గొని విజ్ఞప్తి చేశారు

### పొదిలి బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని షేక్ వి మహిన్‌కు కలెక్టర్ ప్రశంస



(షణ్ముఖ వెలుగు, పొదిలి, మే 2)

మండల స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల తరపున పదవ తరగతి ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరచి 600 మార్కులకు గాను 585 మార్కులు సాధించి ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభంజనం సృష్టించిన పొదిలి బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని షేక్ వి మహిన్‌ను జిల్లా కలెక్టర్ పి రాజాబాబు సన్మానించి, ప్రశంస పత్రం, జ్ఞాపికను అందించి శుభాకాంక్షలు తెలిపారు. శనివారం ఉదయం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని పిజిఆర్ఎస్ హాలులో జరిగిన పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ పి రాజాబాబు మాట్లాడుతూ పదవ తరగతి పరీక్ష ఫలితాలలో మన జిల్లా రాష్ట్రంలో 4వ స్థానంలో నిలిచిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందుతుందని కలెక్టర్ సంతోషం వ్యక్తం చేశారు. ఉత్తమ ఫలితాలు రావడానికి విద్యార్థినీ, విద్యార్థులను తీర్చిదిద్దిన ఉపాధ్యాయ బృందానికి అభినందనలు తెలియజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఇఓ రేణుక, వివిధ మండలాల యంఇఓలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

### టెన్త్ విద్యార్థిని కటారి శ్రీ కన్యకు సన్మానం



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మే 2)

మండలంలోని కరేడు పంచాయితీ అలగాయపాలెం గ్రామానికి చెందిన ఒక నిరుపేద కుటుంబం, స్టూడెంట్ కటారి శ్రీ కన్య ఇటీవల జరిగిన టెన్త్ క్లాస్ శ్రీ పాతాళ వెంకటసుబ్బయ్య శ్రేష్టి జిల్లా ఉన్నత పాఠశాల కరేడు గవర్నమెంట్ హై స్కూల్లో చదివి 587 మార్కులు వచ్చినందు వల్ల ఊరు కాపులు, పెద్దలు, నాయకులు శాలువా కప్పి అభినందించారు. గ్రామం తరపున పెద్దకాపు వాయిల వెంకటేశ్వర్లు రూ.10.116 ఆ కుటుంబానికి సహాయం అందించారు. అలగాయపాలెం టిడిపి నాయకులు రూ.5,000లు సహాయం అందించారు. వాయిల తిరపతి రూ.1,000 సహాయం అందించారు. అలాగే ఎంతో మంది స్టూడెంట్స్‌కి అండగా నిలుస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

### మోక్ష మార్గ సోపానాలు.. అన్నమయ్య సంకీర్తనలు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 2)

తొలి తెలుగు వాగ్గేయకారుడు ద్రావిడగమ సార్వభౌముడు శ్రీ తాళ్లపాక అన్నమాచార్య 618 జయంతి వేడుకలు స్థానిక సంతపేట శ్రీ షిరిడి సాయిబాబా మందిరం కొలువై ఉన్న శ్రీమాన్ అన్నమయ్య విగ్రహ సన్నిధిలో శ్రీ తాళ్లపాక అనుమాచార్య సంగీత సాహిత్య సేవా సమితి ఆధ్వర్యంలో అత్యంత వైభవో పేతంగా నేత్రపర్వంగా జరిగింది. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు ఐ మురళీకృష్ణ మాట్లాడుతూ అన్నమయ్య సాహిత్యం భక్తి సాహిత్య చరిత్రలో ఎల్లప్పుడూ నిలిచిపోతుందని పేర్కొన్నారు. మానవ జీవితం పరమ లక్ష్యమైనటువంటి మోక్ష సాధనకు అన్నమాచార్య 32వేల సంకీర్తనలు దోహదపడతాయి శ్లాఘించారు. ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు పొన్నూరు వెంకట శ్రీనివాసులు మాట్లాడుతూ సకల వేద సారం సకల మంత్రసారం అన్నమాచార్య సంకీర్తనలలో నిబిడీకృతమై ఉన్నదని పేర్కొన్నారు. జిల్లా విశ్వ హిందూ పరిషత్ అధ్యక్షులు తూముకుంట మల్లికార్జునరావు మాట్లాడుతూ అన్నమాచార్య సంకీర్తనలు సమకాలీన సమాజంలో శారీరక మానసిక రుగ్మతలకు ఔషధంగా పనిచేస్తాయని పేర్కొన్నారు. దేవస్థానం అర్చకులు సుధాకర స్వామి ఆధ్వర్యంలో స్వామివారికి అష్టోత్తర శతనామావళి దివ్య మంగళ హారతి విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా టిటిడి గాయకులు, సుమధుర స్వరనిధి ఐ మురళీకృష్ణ, కె త్రిపుర సుందరి, కే పాండురంగనాథ్, తదితర గాయనీ, గాయకులు ఆలపించిన గోవిందా గోవిందా, కొండలలో నెలకొన్న, వేదం బివ్వని వెదకేదిని వంటి సంకీర్తనలతో గోవింద నామ బృంద గానంతో కార్యక్రమం ఆద్యంతం హృద్యంగా సాగింది. కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షురాలు కే త్రిపుర సుందరి, సభ్యులు దామచర్ల ప్రసన్న కుమారి, డాక్టర్ ప్రసాదరావు, ఓవిఎస్ ప్రసాద్, సర్వేశ్వరరావు, పీ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. తదనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం జరిగింది.




ప్రకాశం | మార్కాపురం | బాపట్ల

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
03.05.26 ఆదివారం


# స్థానిక ఎన్నికలకు సిద్ధం కండి

**అలకలుమానండి.....సమన్వయంతో ముందుకు సాగండి**
**రాష్ట్రంలో 80 శాతం ప్రజలు సంతోషంగా ఉన్నారు**
**సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్**
**మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి**

**(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, మే 2)**

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అయ్యాయని వాటి గురించి ప్రజలకు వివరించి ఓటర్లను ఆకర్షించాలని, గత ప్రభుత్వానికి, ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి గల వ్యత్యాసాలను ప్రజలకు తెలియజేసి వారి సమస్యలను మీరు పరిష్కరించేందుకు కృషి చేయాలని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. శనివారం మండల తెలుగుదేశం పార్టీ విస్తృత సమావేశం మండలంలోని సీతానాగులవరం సమీపాన గల శ్రీ ఆంజనేయస్వామి దేవాలయ ప్రాంగణంలో మండల టిడిపి కన్వీనర్ ఉడుముల చిన్నపరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని సూచించారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు అందరూ సిద్ధంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ అలకలు వీడి సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. స్థానిక ఎన్నికలలో విజయఢంకా మోగించాలన్నారు. రాబోయే రోజుల్లో ప్రతి గ్రామంలో ఒక రోజంతా బస చేసి మీ సమస్యల పరిష్కారం శ్రీకారం చుడతానని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వెనుకబడ్డ మన పశ్చిమ ప్రాంత ప్రజల ఆకాంక్షల మేరకు మార్కాపురం జిల్లా చేశారని, అలాగే నాలుగైదు నెలల్లో వెలుగొండ కూడా



పూర్తి చేస్తారని దీంతో ప్రజలకు ఉపాధి, రైతులు కోటీశ్వరులు అవుతారని ఆయన ప్రగాఢ విశ్వాసాన్ని తెలియజేశారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ ప్రకారం అన్ని పథకాలను ప్రజలకు అందించడంలో సఫలీకృతుడయ్యారన్నారు. ఇప్పటికే వైయస్సార్ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ప్రభుత్వం దివాలా తీసిందన్నారు. పీకల్లోతు అప్పుల ఊబిలో మునిగిన ప్రభుత్వాన్ని ఇప్పుడిప్పుడే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, నారా లోకేష్, రాష్ట్ర టిడిపి పార్టీ వర్కింగ్ కమిటీ చైర్మన్‌లు సంయుక్తంగా కలిసి గాడిలో పెడుతున్నారన్నారు. నాయకులు, కార్యకర్తలు రాగద్వేషాలకు లోను కాకుండా అలకలు మాని త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికల్లో పార్టీకి పూర్వవైభవాన్ని తేవాలని ఆయన పిలుపునిచ్చారు. ముందుగా ఒంగోలు పార్లమెంట్ ఉపాధ్యక్షులు సీనియర్ నాయకుడైన కంచర్ల కాశయ్య మాట్లాడుతూ గ్రామాలలో సామాన్య ప్రజలు గృహ నిర్మాణాలు చేపట్టాలంటే బేస్ మటాలకు గ్రావెల్ కొనడం(మట్టిని) చాలా బాధాకరంగా ఉందని ప్రభుత్వం పై ప్రజలు (తరువాయి 4లో...)



## పీఎం సూర్యఘర్‌తో ఎస్సీ, ఎస్టీలకు ఉచిత సోలార్ కనెక్షన్లు
## బీసీ, ఓసీ వినియోగదారులకు రాయితీ పై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు

**3 నెలల్లో 6 లక్షల కనెక్షన్ల పూర్తే లక్ష్యంగా ముందడుగు**
**ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్**

**(షణ్ముఖ వెలుగు, అద్దంకి, మే 2)**

పీఎం సూర్యఘర్‌తో రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు ఉచితంగా సోలార్ కనెక్షన్లు అందిస్తున్నామని రాష్ట్ర ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. శనివారం అద్దంకి నియోజకవర్గంలో మంత్రి గొట్టిపాటి విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా అనమనమూరులో పీఎం సూర్యఘర్ పథకాన్ని ఆయన ప్రారంభించారు. పేదలకు విద్యుత్ స్వావలంబన కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఉచితంగా సూర్యఘర్ కనెక్షన్లు అందిస్తుందని మంత్రి గొట్టిపాటి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు మూడు నెలల్లో 6 లక్షల సూర్యఘర్ సోలార్ కనెక్షన్లు పూర్తి చేయడానికి చర్యలు చేపట్టామని అన్నారు. మరోవైపు పీఎం కుసుమ్ పథకం ద్వారా వ్యవసాయానికి పగటిపూట నిరంతరాయంగా 9 గంటల విద్యుత్ సరఫరా చేయవచ్చని మంత్రి వివరించారు. (తరువాయి 4లో...)

## గంజాయి కేసుల్లో పాత నిందితులు, వినియోగదారులు, విక్రేతలకు కౌన్సెలింగ్

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 2)**

ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు జిల్లాలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల నిర్మూలన లక్ష్యంగా టాస్క్ ఫోర్స్ పోలీసులు ముమ్మర చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా గంజాయి వినియోగిస్తూ పట్టుబడిన పలువురు పాత ముద్దాయిలకు శనివారం టాస్క్ ఫోర్స్ కార్యాలయంలో ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు. కౌన్సెలింగ్ సందర్భంగా గంజాయి, మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, చట్టపరమైన పరిణామాలు, కుటుంబం, సామాజిక జీవనం పై ప్రభావాలను టాస్క్ ఫోర్స్ ఇంచార్జ్ సిఐ భీమా నాయక్ వివరించారు. ఈ సందర్భంగా హాజరైన ముద్దాయిల కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ పిల్లల ప్రవర్తన పై నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. ఇలాంటి కార్యకలాపాలను అణచి వేసేందుకు పోలీస్‌శాఖ నిరంతరం కృషి చేస్తోందని, ఎవరైనా గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల వినియోగం (తరువాయి 4లో...)



## అట్టహాసంగా ఒంగోలు పురపాలక సంఘ 150 వసంత వేడుకలు ప్రారంభం

**చర్చి సెంటర్లో అశోక చిహ్న స్తూపం ఆవిష్కరణ**
**ఒంగోలు చరితను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్తామన్న కలెక్టర్, ఎమ్మెల్యేలు**

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, మే 2)**

ఘన చరిత కలిగిన ఒంగోలు పురపాలక సంఘ వైభవాన్ని ప్రజలకు తెలిపేలా అధికార యంత్రాంగం చేపట్టిన వేడుకలలో తొలి ఘట్టానికి అంకురార్పణ జరిగింది. ఇందులో భాగంగా ఒంగోలు పురపాలక సంఘం ఏర్పడి 150 సంవత్సరాలు పూర్తి కానున్న నేపథ్యంలో శనివారం రాత్రి నగరంలోని చర్చి సెంటర్ లో ఏర్పాటుచేసిన 25 అడుగుల ఏకశిలా అశోక్ చిహ్న స్థూపం ప్రారంభోత్సవం, లోగో ఆవిష్కరణ కార్యక్రమం వేద మంత్రోచ్ఛరణల మధ్య అట్టహాసంగా జరిగింది. జిల్లా కలెక్టర్ మరియు ఒంగోలు మున్సిపల్ (తరువాయి 4లో...)




## కేసులు భారం తగ్గించేందుకే అదనపు కోర్టులు ప్రారంభం

**హైకోర్టు న్యాయమూర్తి నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు**



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, మే 2)**

కేసులు భారం తగ్గించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా అదనపు కోర్టులు ఏర్పాటు చేస్తున్నామని హైకోర్టు న్యాయమూర్తి నిమగడ్డ వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం మార్కాపురంలోని కోర్టు భవనాల సముదాయంలో రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టును

4

## సమగ్ర ప్రణాళిక, నిరంతర సాధనతో అద్భుతాలు ఆవిష్కృతం




**జిల్లా కలెక్టర్ పి రాజాబాబు**

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, మే 2)**

సమగ్ర ప్రణాళిక, నిరంతర సాధనతో అద్భుతాలు ఆవిష్కృతమవుతాయని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు చెప్పారు. తాజాగా పదో తరగతి పబ్లిక్ పరీక్షలలో వచ్చిన ఫలితాలే దీనికి నిదర్శనం అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, వివిధ శాఖల ఆధ్వర్యంలోని సంక్షేమ హాస్టళ్లలో చదువుతూ టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం ప్రకాశం భవనంలోని గ్రీవెన్స్ హాలులో అభినందన కార్యక్రమం జరిగింది. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులలోని ప్రతిభను వెలికితీసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా ' వన్ ఆఫీసర్ - వన్ ఇనిస్టిట్యూట్ ' పేరుతో ప్రతి జిల్లాస్థాయి అధికారి సంక్షేమ హాస్టళ్లను రెగ్యులరుగా తనిఖీ చేసి వాటిలోని సమస్యల పరిష్కారానికి చర్యలు (తరువాయి 4లో...)



# అట్టహాసంగా ఒంగోలు పురపాలక సంఘ 150 వసంత వేడుకలు ప్రారంభం



కార్పొరేషన్ స్పెషల్ ఆఫీసర్ అయిన పి రాజాబాబు, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు, సంతనూతలపాడు ఎమ్మెల్యే బి ఎన్ విజయ్ కుమార్ వీటిని ఆవిష్కరించారు. ఈ 150 ఏళ్లలో ఒంగోలు మున్సిపాలిటీలో చోటుచేసుకున్న పరిణామాలను తెలిపేలా రూపొందించిన వీడియోను ఈ కార్యక్రమంలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రామాయపట్నం పోర్టు, బిపిసిఎల్, ఇండోసోల్ పరిశ్రమలు, గ్రానైట్ ఇండస్ట్రీ ద్వారా వేగంగా అభివృద్ధి జరుగుతున్న ప్రకాశం జిల్లాలో అతిథులకు ఆతిథ్యం ఇచ్చేలా సకల సౌకర్యాలతో ఒంగోలు నగరం కూడా కాలానుగుణంగా అభివృద్ధి పథంలో నడుస్తోందన్నారు.







ప్రస్తుత పరిణామాలను, ఒంగోలు పురపాలక సంఘ గత వైభవాన్ని తెలిపేలా 150 ఏళ్ల ఉత్సవాలను ఘనంగా నిర్వహించబోతున్నట్లు చెప్పారు. 1876 సెప్టెంబర్ 30వ తేదీన ఒంగోలు పురపాలక సంఘం ఏర్పడిందని, ఈ నేపథ్యంలో ఈ ఏడాది సెప్టెంబర్ నెలాఖరు వరకు వివిధ ఆవిష్కరణలు, ప్రారంభోత్సవాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. నగర అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్న అధికార యంత్రాంగంతో కలిసి రావాలని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే జనార్ధన్ మాట్లాడుతూ అశోక స్తూపం సుపరిపాలనకు నిదర్శనమని చెప్పారు. అంతటి విశిష్టత కలిగిన ఈ స్థూపాన్ని నగరంలో ఎంతో గుర్తింపు పొందిన చర్చి సెంటర్లో ఆవిష్కరించడం సంతోషకరమన్నారు. ఈ స్థూపాన్ని ఇక్కడ ఏర్పాటు చేసినప్పటికీ ఈ ప్రాంతాన్ని చర్చి సెంటర్ గానే పిలుస్తామని స్పష్టం చేశారు. ఈ వేడుకల్లో భాగంగా పలు ప్రాంతాలలో ఇలాంటి చిహ్నాలు, విగ్రహాలు, పెయింటింగ్స్ ఏర్పాటు చేస్తామన్నారు. అంతేకాకుండా నగర అభివృద్ధి పైనా, రోడ్ల విస్తరణ పైనా ప్రత్యేక దృష్టి పెడతానని తెలిపారు. క్రికెట్ స్టేడియం, ఇండోర్ స్టేడియం కూడా నగరవాసులకు త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తానని చెప్పారు. విశాఖపట్నం కమిషనర్ గా పనిచేసిన అనుభవం ఉన్న కలెక్టర్ రాజాబాబు అదేవిధంగా ఒంగోలు నగరాన్ని కూడా అభివృద్ధి చేసేలా ప్రజా ప్రతినిధులతో కలిసి చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఎమ్మెల్యే విజయ్ కుమార్ మాట్లాడుతూ మన చరిత్రను భావితరాలకు తెలపాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విధంగా వచ్చే ఐదు నెలల పాటు అనేక కార్యక్రమాలు నిర్వహించేలా అధికారులు ప్రణాళిక రూపొందించడం శుభ పరిణామమని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ కామేపల్లి సీతారామయ్య, ఆర్డీవో లక్ష్మీ ప్రసన్న, రవిప్రియ హాస్పిటాలిటీ అధినేత కంది రవిశంకర్, మున్సిపల్ కమిషనర్ రామ్ భూపాల్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాచగర్ల వెంకట్రావు, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



# స్థానిక ఎన్నికలకు సిద్ధం కండి

విరుచకపడుతున్నారన్నారు. అనంతరం రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ గోపీనాథ్ చౌదరి మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక లోటు పాట్లను, గత ప్రభుత్వాల దౌర్జన్య, దమన కాండలు గురించి కూడా ప్రజలకు వివరించి ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం మార్కెట్ యార్డ్ చైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి, దగ్గుల శ్రీనివాసరెడ్డి, మండలంలోని టిడిపి నాయకులు, మాజీ ఎంపీపీ పులివెందుల ఏసుదాసు, మేకల చిన్నచిరెడ్డి, మాజీ ఎంపిటిసి దండ వెంకటరెడ్డి, మండల మాజీ కన్వీనర్లు కే నరసింహారావు, వి జాన్, పొదిలి ఏఎంసి కమిటీ డైరెక్టర్ కె సోమయ్య, కూచిపూడి రోశప్పనాయుడు, జి నరసింహారావు, గోలమరి శ్రీనివాసరెడ్డి, రావూరి నాగ తిరుపతయ్య, ఆర్ గురవయ్య, టి చలమారెడ్డి, కందుల చిట్టిబాబు, శాంతయ్య, కోలగట్ల నారాయణరెడ్డి, అరికట్ల వెంకటేశ్వరరెడ్డి, కుందురు సత్యనారాయణరెడ్డి, కోలగట్ల కాశీశ్వరరెడ్డి, సూరేపల్లి తిరుపతయ్య, జి మోహన్‌రావు, నంబుల తిరుపతయ్య, నంబుల లక్ష్మయ్య, వై వెంకటరెడ్డి, ఈర్ల వెంకటయ్య, మేకల వెంకట్, కాలంగి శ్రీనివాసులు, జి సుబ్బయ్య, కుందురు చిన్నకాశిరెడ్డి, వి వెంకటరెడ్డి, కే గంగాధర్‌రెడ్డి, గాలి రంగారెడ్డి, గోసు వెంకటేశ్వర్లు, ఎస్‌కె చిన్న ఖాసీం అలీ, పిన్నిక ఆవురాజు, మండల స్థాయి టిడిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# గంజాయి కేసుల్లో పాత నిందితులు, వినియోగదారులు, విక్రేతలకు కౌన్సెలింగ్

లేదా విక్రయం చేపడుతున్నట్లు గమనించినట్లయితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 112 ద్వారా సమాచారం అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టాస్క్ ఫోర్స్ ఎస్‌ఐ చెంచయ్య, ఏఎస్‌ఐ మహబూబ్ భాష, సిబ్బంది పాల్గొన్నారు.

# కేసులు భారం తగ్గించేందుకే అదనపు కోర్టులు ప్రారంభం



హైకోర్టు న్యాయమూర్తి వై లక్ష్మణరావు, జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సత్యానంద్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ కేసులు త్వరితగతిన పరిష్కారం అయ్యేందుకు ఈ కోర్టులు దోహదపడతాయన్నారు. కోర్టులు భారతదేశ నూతన దేవాలయాలుగా పేర్కొన్నారు. సమస్యల కోసం ఈ గుడికి వచ్చే ప్రజలను నమ్మకాన్ని వమ్ము చేయకుండా దేశ సమగ్రతను కాపాడాలని పిలుపునిచ్చారు. న్యాయవ్యవస్థ సమాజానికి పునాది వంటిదని అభివర్ణించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కోర్టుల అభివృద్ధికి సమర్థవంతమైన సహకారం అందిస్తున్నాయని వివరించారు. న్యాయ సేవలు ప్రజలకు మరింత అందుబాటులోకి తీసుకురావడంలో ఈ చర్యలు కీలకంగా మారుతాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు శివశంకర్‌రెడ్డి, న్యాయవాదులు, ఇతర కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# సమగ్ర ప్రణాళిక, నిరంతర సాధనతో అద్భుతాలు ఆవిష్కృతం

తీసుకోవడం ద్వారా విద్యార్థులలో విశ్వాసాన్ని పెంపొందించామన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలకు కూడా వివిధ శాఖల మండల స్థాయి అధికారులను ఇన్చార్జిలుగా నియమించి ' 100 రోజుల ప్రణాళిక ' అమలవుతున్న తీరును పర్యవేక్షించేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో చదివే విద్యార్థులను తమ సొంత బిడ్డలుగా భావించి అధికార యంత్రాంగం మొత్తం సమిష్టిగా పనిచేయడంతో ఈసారి టెన్త్ ఫలితాల్లో రాష్ట్రంలోనే ప్రకాశం జిల్లా నాలుగో స్థానంలో నిలిచిందన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో మరింత మెరుగైన స్థానం కోసం ప్రారంభం నుంచి దృష్టి సారిస్తామని చెప్పారు. వెన్ను తట్టి ప్రోత్సహిస్తే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కూడా రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించే సత్తా ఉందన్నారు. వారికి ఈ విధంగా టీచర్లు, తల్లిదండ్రులు మద్దతుగా నిలవాల్సిన అవసరం ఉందని కలెక్టర్ చెప్పారు. పిల్లలలోని ఆసక్తిని గుర్తించి ఆ దిశగా వారిని



ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు సూచించారు.

**కలెక్టర్ లక్ష సహాయం.....**

పదో తరగతి ఫలితాలలో 590కి పైగా మార్కులు సాధించిన 13 మందికి, మండల స్థాయిలో టాపర్లుగా నిలిచిన 31 మందికి ఒక్కొక్కరికి రూ. 2,000ల చొప్పున ఈ కార్యక్రమంలో ప్రోత్సాహక నగదు బహుమతి, జ్ఞాపిక, ప్రశంస పత్రం ఇచ్చి సత్కరించారు. దీనికోసం కలెక్టర్ వ్యక్తిగతంగా లక్ష రూపాయల ఆర్థిక సహాయం చేసినట్లు డీఈవో రేణుక తెలిపారు. జిల్లా కలెక్టర్ మార్గదర్శకం, క్షేత్రస్థాయి పరిస్థితిని ప్రతిరోజు టెలికాన్ఫరెన్స్ నిర్వహించి పర్యవేక్షించటం ద్వారా జిల్లాలో ఈ సారి మంచి ఫలితాలు వచ్చాయని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ సుబ్బారెడ్డి, ప్రభుత్వ పరీక్షల విభాగం జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల సొసైటీ జిల్లా కోఆర్డినేటర్ జయ, బీసీ సంక్షేమ అధికారి నిర్మల జ్యోతి, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మా నాయక్, డిప్యూటీ డీఈవోలు, ఎంఈఓలు, ర్యాంకులు సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



# పీఎం సూర్యఘర్‌తో ఎస్సీ, ఎస్టీలకు ఉచిత సోలార్ కనెక్షన్లు

## బీసీ, ఓసీ వినియోగదారులకు రాయితీ పై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యుత్ చార్జీలు ఒక్క రూపాయి కూడా పెంచలేదని స్పష్టం చేశారు. అనంతరం రూ. 18 లక్షల వ్యయంతో నిర్మించిన బీసీ కమ్యూనిటీ భవనాన్ని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ప్రారంభించి, ప్రజలకు అంకితం చేశారు. అనంతరం కొత్తగా నిర్మించిన అంకమ్మ తల్లి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమం, రైతుల అభ్యున్నతి కోసం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.







# మత్స్యకారులు పడవలు నిలుపుకునేందుకు ప్రభుత్వ భూముల కేటాయింపునకు చర్యలు

## జిల్లా కలెక్టర్ పి రాజాబాబు





(షణ్ముఖ వెలుగు, కొత్తపట్నం, మే 2)

మత్స్యకారులు పడవలు నిలుపుకునేందుకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములను పరిశీలించి కేటాయించేలా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు తెలిపారు. ' పల్లెనిద్ర ' కార్యక్రమంలో భాగంగా కొత్తపట్నం మండలం కె.పల్లెపాలెం స్వర్ణ గ్రామ సచివాలయంలో శు క్రవారం రాత్రి నిద్రించిన కలెక్టర్, శనివారం వేకువ జామునే ఆ గ్రామంలో పర్యటించారు. శు క్రవారం రాత్రి గ్రామసభలో తమ పడవలను నిలుపుకునేందుకు స్థలం కావాలని స్థానికులు కోరగా, అందుబాటులో ఉన్న స్థలాలను శనివారం ఉదయం కలెక్టర్ పరిశీలించారు. పారిశుద్ధ్యము, తాగునీటి సరఫరా జరుగుతున్న తీరును కూడా పరిశీలించారు. తడి చెత్త, పొడి చెత్తను ఇంటి వద్దే వేరుచేసి పారిశుద్ధ్య కార్మికులకు ఇవ్వాలని గ్రామస్తులకు ఆయన అవగాహన కల్పించారు. బబుల్ వాటర్ లో పోషకాలు ఉండవని, శుద్ధిచేసి ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఖనిజాలతో కూడిన నీటినే తాగాలని ప్రజలకు ఆయన చెప్పారు. ప్రజల సమక్షంలోనే ఈ మేరకు కులాయి నీటికి పరీక్షలు నిర్వహించి వారికి చూపించారు. గ్రామంలోని రక్షిత మంచినీటి ట్యాంకును సందర్శించి ఆ ప్రాంగణంలో పారిశుద్ధ్యము, ట్యాంకు నిర్వహణ తీరును పరిశీలించారు. ట్యాంకును శుభ్రం చేస్తున్న విధానం, క్లోరినేషన్ గురించి ఆర్డబ్ల్యూఎస్ ఎస్. ఈ. నాగేశ్వరరావు ఈ సందర్భంగా ఆయనకు వివరించారు. స్థానికంగా ఉన్న ' చెత్త నుంచి సంపద తయారీ కేంద్రా'న్ని కలెక్టర్ తనిఖీ చేశారు. నిర్వహిస్తున్న తీరు, కంపోస్టు తయారీ, ఘన వ్యర్థాలను విక్రయించటం ద్వారా గ్రామపంచాయతీకి వస్తున్న ఆదాయ వివరాలను డిపిఒ వెంకటేశ్వరరావు వివరించగా కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా ఉన్న చెరువు అభివృద్ధి ప్రణాళికపై కలెక్టర్ ఆరా తీశారు. చెరువులో పూడికను తీసి, కట్టపై వాకింగ్ ట్రాక్, చిల్డ్రన్స్ పార్క్, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసేలా ప్రణాళిక రూపొందించినట్లు డ్వామా పి.డి. జోసఫ్ కుమార్ తెలిపారు. అల్లూరు చెరువు పక్కన రోడ్డు వెంట కాలువను భవిష్యత్తు అవసరాలకు తగినట్టుగా తవ్వే ప్రణాళికపై కలెక్టర్ స్థానికులతోనూ, అధికారులతోనూ చర్చించారు. స్థానిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులను ఆయన ఆదేశించారు.

**గడ్డ పలుగు పట్టిన కలెక్టర్...**

అల్లూరులో ఉపాధి హామీ పనులు జరుగుతున్న తీరు, కార్మికులకు పని ప్రదేశంలో కల్పించిన సౌకర్యాలను కలెక్టర్ పరిశీలించారు. కార్మికులతో కలిసి ఆయన గడ్డ పలుగు చేతపట్టి మట్టిని తొలిచారు. కార్మికులతో ప్రత్యేకంగా మాట్లాడి కుటుంబ స్థితిగతులను తెలుసుకున్నారు. పేదరికంతో బిడ్డలను చదువుకు దూరం చేయవద్దని, పాఠశాలకు పంపించాలని సూచించారు. వారి ఆవాస ప్రాంతంలో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట ఆర్డిఓ లక్ష్మీ ప్రసన్న, వివిధ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు ఉన్నారు.





## 10వ తరగతి పరీక్ష ఫలితాలలో పీఎం శ్రీ పివిఎస్ఎస్ అత్యుత్తమ ప్రదర్శన

(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మే 2)

పీఎం శ్రీ పివిఎస్ఎస్ జిల్లా పరిషత్ హై స్కూల్ కరేడు నందు మార్చి 2026 10వ తరగతి పరీక్ష ఫలితాలలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎంసి సభ్యులు ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు అభినందించారు. ఉలవపాడు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో అత్యధిక మార్కులు 587 సాధించిన కే శ్రీ కన్య ను కందుకూరు నియోజకవర్గం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. అలాగే ఎంపీ సదరు విద్యార్థిని యొక్క ఉన్నత చదువులకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని వారి ట్రస్ట్ ద్వారా అందిస్తామని గ్రామ ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామ కాపులు పాల్గొని విద్యార్థిని పై ప్రశంసలు కురిపించారు.



# ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్

## ఎమ్మెల్యే బి ఎన్ విజయ్ కుమార్





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 2)

ఒంగోలులో మంగమూరురోడ్డు మర్రి చెట్టు దగ్గర సంతనూతలపాడు ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే బి ఎన్ విజయ్ కుమార్ శనివారం సంతనూతలపాడు నియోజకవర్గానికి చెందిన ప్రజలతో ప్రజా దర్బార్‌ను నిర్వహించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించడమే ఈ దర్బార్ లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుండి మొత్తం 25 అర్జీలు అందాయి. ప్రతి ఒక్కరి అర్జీని స్వయంగా స్వీకరించిన ఎమ్మెల్యే వారి సమస్యలను వివరంగా తెలుసుకున్నారు. ముఖ్యంగా ఇళ్ల స్థలాలు, గృహ నిర్మాణ అనుమతులు, రేషన్ కార్డులు, కొత్త పెన్షన్లు వంటి అంశాలకు సంబంధించిన అర్జీలు అధికంగా రావడంతో, వెంటనే రెవెన్యూ అధికారులతో చర్చించి తక్షణ పరిష్కార చర్యలు చేపట్టారు.ఇతర విభాగాలకు సంబంధించిన సమస్యలపై సంబంధిత శాఖల అధికారులకు సూచనలు ఇవ్వగా, ఎక్కువశాతం సమస్యలు అక్కడికక్కడే పరిష్కారం చేశారు. ప్రజా సమస్యలను సాంకేతిక, ఆర్థికపరంగా పరిశీలించి వేగంగా పరిష్కరించేందుకు పని చేస్తానని ప్రజలకు ఎమ్మెల్యే విజయ్ కుమార్ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మద్దిపాడు మండల సీనియర్ నాయకులు పోతినేని శ్రీనివాసరావు (పి.యస్.ఆర్), కూటమి నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థిని రజియా సుల్తానాను సన్మానించిన కలెక్టర్ రాజబాబు


### పదవతరగతి పరీక్షలో మండలంలో ప్రధమ స్థానం సాధించిన రజియా సుల్తానా



(షణ్ముఖ వెలుగు, కంభం, మే 2)

పదో తరగతి పరీక్ష ఫలితాలలో మార్కాపురం జిల్లా కంభం మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని షేక్ రజియా సుల్తానా 600 మార్కులకు 582 మార్కులు సాధించి మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా ఈరోజు ప్రకాశం ప్రకాశం భవనంలోని పీఎస్ఆర్ హాల్ నందు జరిగిన సమావేశంలో రజియా సుల్తానాను వారి తల్లిదండ్రులను ప్రకాశం జిల్లా కలెక్టర్ రాజబాబు, జిల్లా విద్యాశాఖ అధికారిని శ్రీమతి రేణుక,అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సుబ్బారెడ్డి, కంభం మండల విద్యాశాఖ అధికారి 2 టి. శ్రీనివాసులు, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు అమూల్య సమక్షంలో ఘనంగా సన్మానించి ప్రశంసా పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కృషి పట్టుదల క్రమశిక్షణ తో కూడిన విద్యాభ్యాసంతో దేనినైనా సాధించవచ్చు అని షేక్ రజియా సుల్తానా నిరూపించారని కొనియాడారు.

## 23 కుటుంబాలకు అండగా సీఎం సహాయ నిధి గూడూరి ఎరిక్షన్ బాబు



(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, మే 2)

యర్రగొండపాలెం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మొత్తం 23 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.11,71,858 విలువైన చెక్కులను యర్రగొండపాలెం నియోజకవర్గం టీడీపీ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్ బాబు అందజేశారు. ప్రజలకు అవసర సమయంలో అండగా నిలుస్తూ, సహాయం అందించే దిశగా సీఎం సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతోందని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ చేకూరి సుబ్బారావు, మండల టీడీపీ అధ్యక్షులు చిట్యాల వెంగళరెడ్డి, నియోజకవర్గ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితాల్లో అద్భుత ప్రదర్శన చూపిన ఉప్పలపాటి ప్రవీణ్ కుమార్



(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, మే 2)

పెద్దారవీడు మండలం తోకపల్లి గ్రామానికి చెందిన ప్రతిభావంతుడుఉప్పలపాటి ప్రవీణ్ కుమార్ ఇంటర్మీడియట్ ఫలితాల్లో అద్భుత ప్రదర్శన కనబరిచాడు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో 470 మార్కులకు గాను 466 మార్కులు సాధించి జిల్లాలో మొదటి స్థానం, రాష్ట్ర స్థాయిలో రెండవ స్థానం పొందాడు. ఈ సందర్భంగా యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు ప్రవీణ్ కుమార్‌ను ఘనంగా సన్మానించారు. అతని ప్రతిభను గుర్తిస్తూ రూ.10,000 నగదు బహుమతిని అందజేశారు. ఇంకా భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షిస్తూ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా గూడూరి ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ ప్రతిభను ప్రోత్సహించడం, విద్యార్థులకు అండగా నిలవడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఇలాంటి విజయాలు సాధించే విద్యార్థులు మరింత ముందుకు రావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి నాయకుడు అనిల్ కుమార్, మండల టిడిపి నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## శ్రీశ్రీ కళావేదిక ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభల గోడ పత్రిక ఆవిష్కరించిన టీడీపీ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు




**(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, మే 2)**

యర్రగొండపాలెం నియోజకవర్గంలో శనివారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శ్రీశ్రీ కళావేదిక మరియు చైతన్య సారస్వత పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో జూన్ 6, 7 తేదీలలో నిర్వహించబోతున్న 7వ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభల పోస్టర్ ను నియోజకవర్గం టీడీపీ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్ బాబు ఆవిష్కరణ చేశారు. రాజమహేంద్రవరం గోదావరి గ్లోబల్ యూనివర్సిటీలో కళారత్న కత్తిమండ ప్రతాప్ కుమార్ సారథ్యంలో జాతీయ ప్రణాళిక అధ్యక్షులు డాక్టర్ టి పార్థసారథి, జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరీభూషణం ఆధ్వర్యంలో నిర్వహించబోతున్న 48 గంటల ఈ కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్‌ను శ్రీశ్రీ కళావేదిక జాతీయ సమన్వయ కర్త గొట్టిముక్కుల నాసరయ్య ఆధ్వర్యంలో యర్రగొండపాలెం నియోజకవర్గం స్థానిక టీడీపీ ఇంచార్జీ గూడూరి ఎరిక్షన్ బాబు, మార్కెట్ యార్డ్ చైర్మన్ చేకూరి వెంకట సుబ్బయ్య, వెంగళరెడ్డి యర్రగొండపాలెం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మరియు టీడీపీ సీనియర్ నాయకులు యోగినాటి శ్రీను, కాకర్ల కోటయ్య, మెడబలిమి అచ్యుతరావు, వెంకట సుబ్బారావు తదితరుల చేతుల మీదగా పోస్టల్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు భాష, తెలుగు సంస్కృతి, తెలుగు వైభవం, తెలుగు సాహిత్యం, తెలుగు కళల అభివృద్ధికి శ్రీశ్రీ కళావేదిక చేస్తున్న సేవలను గుర్తించి అందరూ అభినందించారు.

## ప్రభుత్వ పాఠశాలలో పవన్ కుమార్ ప్రతిభ 585 మార్కులతో మండలంలో ప్రథమ స్థానం

### విద్యార్థిని సన్మానించిన కలెక్టర్ రాజాబాబు



**(షణ్ముఖ వెలుగు, పుల్లలచెరువు, మే 2)**

పదవ తరగతి ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన పుల్లలచెరువు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి తక్కెళ్ళ పవన్‌కుమార్‌ను జిల్లా అధికారుల సమక్షంలో ఘనంగా సన్మానించారు. 585 మార్కులు సాధించి మండలంలోనే ప్రథమ స్థానం దక్కించుకున్న పవన్ విజయాన్ని గుర్తించిన ప్రకాశం జిల్లా కలెక్టర్ రాజాబాబు శనివారం ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసి అభినందనలు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల కృషి, పట్టుదల విజయాలకు మూలమని ప్రభుత్వ పాఠశాలల నుంచీ ఇలాంటి ప్రతిభావంతులు రావడం గర్వకారణమని పేర్కొన్నారు. పవన్ మరింత ఉన్నత విద్యను లక్ష్యంగా పెట్టుకుని ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రేణుక, మండల విద్యాశాఖ అధికారులు యం వెంకట భాస్కర్, యం జే ఇందిరా ప్రసాద్, పాఠశాల సిబ్బంది పాల్గొని పవన్‌ను అభినందించారు. విద్యార్థి తండ్రి మూర్తయ్య కుమారుడి విజయం పై సంతోషం వ్యక్తం చేస్తూ ఉపాధ్యాయుల శ్రమకు ధన్యవాదాలు తెలిపారు. మండలంలో ప్రభుత్వ పాఠశాల స్థాయిని మరింత ఎత్తుకు తీసుకెళ్లిన పవన్‌కుమార్ విజయం ప్రస్తుతం ఆదర్శంగా నిలుస్తోంది.

# లక్ష్యం నిర్దేశించుకొని ముందుకు సాగాలి

**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మే 2)**

మండలంలోని భీమవరం పంచాయతీ కార్యాలయ ఆవరణలో శనివారం భీమవరం జిల్లా పరిషత్ హై స్కూల్‌కు సంబంధించి 2026 పదవ తరగతి ఫలితాల లో మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థినీ, విద్యార్థుల అభినందన కార్యక్రమం పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ డి. విజయకుమార్ అధ్యక్షతన గ్రామ పెద్దల సమక్షంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ మాట్లాడుతూ కృషి పట్టుదలతో సాధించిన విజయాలను భవిష్యత్ లోను కొనసాగించాలని, లక్ష్యం నిర్దేశించుకొని ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. అలాగే ప్రయివేట్ స్కూల్స్ కు ధీటుగా ప్రభుత్వ స్కూల్ నుండి ఉత్తమ ఫలితాలు సాధించిన స్కూల్ యాజమాన్యంను అభినందించడం జరిగింది. స్కూల్ హెడ్ మాస్టర్ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ స్కూల్‌లో చేర్పించాలని, సరైన విధానం లో శిక్షణ నిచ్చి, విద్యతో పాటు క్రమశిక్షణ







భీమవరం హై స్కూల్ నందు తొలిసారి కృష్ణాపురం గా కాలని కి చెందిన విద్యార్థిని పొట్లూరి చెంచులక్ష్మి ఉత్తీర్ణత సాధించినందున పాఠశాల ప్రధానోపాధ్యాయులు వారు రూ.1,000ల ప్రోత్సాహక నగదును అందించి శాలువతో కప్పి సత్కరించారు. దీనితో పాటుగా స్థానిక ఎరువుల డీలరు కొత్త శ్రీనివాసులురెడ్డి ఉత్తమ ప్రతిభ సాధించిన నలుగురికి రూ.2,000ల నగదు ప్రోత్సాహం అందించారు. ఈ విద్యార్థుల అభినందన కార్యక్రమం ఏర్పాటు చేసిన స్పెషల్ ఆఫీసర్, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలను భీమవరం జడ్పీ హైస్కూల్ తరుపున కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాలవెల్లి అమర్నాథ్‌రెడ్డి, మల్లవరపు కోటిరెడ్డి, గ్రామ పంచాయతీ సెక్రటరీలు పోలయ్య, ప్రవీణ్, స్వర్ణ గ్రామం సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నేర్పించి ఉత్తమ విద్యతో పాటు ఉత్తమ పౌరులు గా తీర్చి దిద్దుతామన్నారు. ఈ సంవత్సరం కంటే రాబోవు సంవత్సరం మెరుగైన ఫలితాలు సాధిస్తామని తెలియజేసారు. తదనంతరం 569 మార్కులు సాధించిన దేవండ్ల అనురాధను శాలువా కప్పి రూ.3,000 పారితోషికం అందించి గ్రామ నాయకులు గణపతి రాజు వెంకట చలపతిరావు అభినందించారు. అలాగే ద్వితీయ స్థానం సాధించిన కొలకలపూడి హర్షవర్ధన్ రెడ్డిని కాకర్లపూడి వెంకట్రామరాజు శాలువ కప్పి రూ.2,000 నగదు అందించి సత్కరించారు. తృతీయ స్థానం సాధించిన విద్యార్థి గోళ్ళ హేమంత్ కుమార్ ను గ్రామ పార్టీ అధ్యక్షులు జాజుల రవి శాలువ కప్పి రూ.1,000 నగదుతో సత్కరించారు.




# బాల బాలికల సమగ్ర అభివృద్ధి, సాధికారత లక్ష్యంగా కిషోర్ వికాసం

## జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పనాకుమారి




**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 2)**

జిల్లాలో బాల బాలికల సమగ్ర అభివృద్ధి మరియు సాధికారతను లక్ష్యంగా చేసుకుని నిర్వహించబడుతున్న "కిషోర్ వికాసం" వేసవి కార్యక్రమం పీజీఆర్ఎస్ హాల్‌లో జిల్లా లెవెల్‌లో మండల్ శిక్షణ కార్యక్రమం జరిగింది. శనివారం జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి అధ్యక్షతన శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యుక్తవయస్కులైన బాల బాలికలకు సరైన మార్గదర్శకత్వం, అవగాహన, రక్షణ కల్పించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. ముఖ్యంగా 11 నుండి 18 సంవత్సరాల మధ్య వయస్సు గల పిల్లల శారీరక, మానసిక, సామాజిక, విద్యా అభివృద్ధికి ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని తెలిపారు. "కిషోర్ వికాసం" వేసవి కార్యక్రమం ద్వారా టీనేజ్ బాల బాలికలకు విద్య యొక్క ప్రాముఖ్యత, పాఠశాల విద్య కొనసాగింపు, సంపూర్ణ ఆరోగ్యం, పోషకాహారం, వ్యక్తిగత, ఋతు పరిశుభ్రత, లైంగిక , పునరుత్పత్తి ఆరోగ్యం, మానసిక ఆరోగ్యం, బాల్య వివాహాల నిషేధ చట్టం, టీనేజ్ గర్భధారణ వల్ల కలిగే సమస్యలు, పోక్సో చట్టం, బాలల హక్కులు, సైబర్ భద్రత, స్వీయ రక్షణ ,జీవన నైపుణ్యాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడం, సరైన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని అభివృద్ధి చేయడం, బాల్య వివాహాలు మరియు బాల కార్మిక వ్యవస్థ వంటి సామాజిక సమస్యలను నివారించడం కోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. గ్రామ మరియు పట్టణ స్థాయిలలో అవగాహన సదస్సులు, చర్చా కార్యక్రమాలు, కౌన్సెలింగ్ సెషన్లు, ఆరోగ్య పరీక్షలు, క్రీడా మరియు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడనున్నాయి. ఈ కార్యక్రమాలను మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విద్యాశాఖ, వైద్య ఆరోగ్యశాఖ, పోలీసుశాఖ, ఐసీడీఎస్ శాఖ, ఇతర సంబంధిత శాఖల సమన్వయంతో నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించబడినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి నాగమణి, జిల్లా బాలల సంరక్షణ అధికారి పి దినేష్ కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సీడీపీఓలు, సూపర్వైజర్లు, సిబ్బంది, ఇతరులు పాల్గొన్నారు.





# శ్రీశైలంలో నిత్య కళారాధనలో భాగంగా శ్రీనటరాజ కూచిపూడి నాట్యలయం పొదిలి చిన్నారుల ప్రదర్శన

## ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శన

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 2)**

శ్రీ నటరాజ కూచిపూడి నాట్యాలయం పొదిలికి చెందిన చిన్నారులు శ్రీశైల దేవస్థానంలో చక్కటి ప్రతిభను కనబరిచారు. శ్రీశైల దేవస్థానంలో నిత్య కళారాధన కార్యక్రమంలో భాగంగా శ్రీ నటరాజ కూచిపూడి నాట్యలయం పొదిలికి చెందిన చిన్నారులు కూచిపూడి ప్రదర్శన చేశారు. నాటి గురువు కే లక్ష్మి ఆధ్వర్యంలో చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. గరుడ గమన, పుష్పాంజలి, పౌర్ణమి అలాగే సంయుక్త హస్తాలు, శ్లోకాలు వేదిక పై పట్టించారు. శ్రీశైల దేవస్థానంలో ఇంతటి అవకాశం మాకు రావడం చాలా సంతోషమని నాట్య గురువు కే లక్ష్మి అన్నారు. పొదిలికి చెందిన శ్రీ వాత్సల్య, పి చార్వి శ్రీ, బి హనాన్యరెడ్డి, అన్వికరెడ్డి, హీరా మీనన్, దీక్షిత, టి యశస్వి పాల్గొన్నారు. తమకు ఇంతటి అవకాశాన్ని కల్పించిన దేవాలయ అధికారులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. కూచిపూడి నాట్యాన్ని పలువురు తిలకించారు. కళావేదిక పై జరిగిన కూచిపూడి నాట్య వైభవం అందర్నీ అలరించింది. కూచిపూడి నాట్యాన్ని ప్రోత్సహించటం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. శ్రీశైల దేవస్థానంలో కళలకు, సాంస్కృతిక కార్యక్రమాలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. చిన్నారులకు రూము, భోజన వసతి ఏర్పాటు చేయడంతో పాటు దైవదర్శనం కూడా కల్పించారన్నారు.









# బస్సులను తనికీ చేసిన అధికారులు





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 2)**

ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఆదేశాల మేరకు ట్రాన్స్పోర్ట్ అధికారులు బస్సులను తనిఖీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అన్ని స్కూల్ బస్సులు ఏఐఎస్63 నిబంధనలకు అనుగుణంగా ఉండేలా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారు. అందులో భాగంగా, స్కూల్ బస్సు యాజమాన్యాలు క్రింది సూచనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. అన్ని స్కూల్ బస్సులను ఏఐఎస్ 63 నిబంధనలకు అనుగుణంగా సరిచేసుకోవాలి. వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికేట్, ఇతర అవసరమైన పత్రాలను నవీకరించుకోవాలి. సంబంధిత రికార్డులను పూర్తి స్థాయిలో సరిచేసి నిర్వహించాలి. 2వ తేదీ నుండి ప్రతి స్కూల్ బస్సు పై ప్రత్యేక తనిఖీలు నిర్వహించబడతాయన్నారు. తనిఖీలలో గమనించిన లోపాలను వెంటనే సరిచేయాలన్నారు. లోపాలు సరిచేసిన తరువాత, వాహనాన్ని తిరిగి తనిఖీ అధికారుల వద్ద చూపించి అనుమతి పొందిన తరువాత మాత్రమే రోడ్డు పై నడపాలన్నారు. ఈ సూచనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ఏవైనా నిర్లక్ష్యం గమనించిన పక్షంలో సంబంధిత యాజమాన్యాల పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# రహదారి వేశారు... వేగనిరోధకాలు మరిచారు

## మర్రిపూడి అడ్డరోడ్ వద్ద పెరుగుతున్న ప్రమాదాలు స్పీడ్ బ్రేకర్లు వేయాలని వాహనచోదకుల ఆందోళన



**(షణ్ముఖ వెలుగు, పొదిలి, మే 2)**

పొదిలి పట్టణంలో ఒంగోలు వెళ్లే ప్రధాన రహదారిలో మర్రిపూడి మండలానికి వెళ్లే అడ్డ రోడ్డు వద్ద ఇటీవల అధికారులు రహదారి మరమ్మత్తులు చేశారు. సుమారు 50 అడుగులకు పైగా అడ్డ రోడ్డు వద్ద రహదారిని బలోపేతం చేసి తారు రోడ్డు వేశారు. జిల్లాలో అతి కీలకమైన ఒంగోలు - నంద్యాల రహదారి పై పొదిలి పట్టణంలోకి ప్రవేశించే అతి కీలకమైన ఈ రహదారి వద్ద మర్రిపూడి మండలం నుంచి వచ్చే వాహనాలు వేగంగా వస్తూ ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. పొదిలి పట్టణంలోకి వచ్చే వాహనాలు వేగంగా వస్తూ మలుపు వద్ద స్పీడ్ బ్రేకర్ లేకపోవడంతో జారిపడి కొందరు వాహన చోదకులు గాయాల పాలయ్యారు. నూతనంగా వేసిన రహదారికి వెంటనే అధికారులు స్పీడ్ బ్రేకర్లు నిర్మించాలని వాహన చోదకులు కోరుతున్నారు.

# గుండెపోటుతో కొలిశెట్టి చంద్రశేఖర్ మృతి

## నివాళులర్పించిన పలువురు నాయకులు, ఆర్యవైశ్య ప్రముఖులు



**(షణ్ముఖ వెలుగు, బద్వేల్, మే 2)**

బద్వేల్ పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త కొలిశెట్టి చంద్రశేఖర్ (65) శుక్రవారం రాత్రి గుండెపోటుతో అకస్మాత్తుగా మృతి చెందారు. గత అనేక ఏళ్లుగా వ్యాపార రంగంలో రాణిస్తూ, అందరితో ఎంతో స్నేహపూర్వకంగా ఉంటూ మంచి గుర్తింపు తెచ్చుకున్న ఆయన మరణం పట్టణంలో విషాదాన్ని నింపింది. దైనందిన జీవితంలో ఎంతో చురుగ్గా ఉంటూ, క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించే చంద్రశేఖర్, ఒక్కసారిగా గుండెపోటుకు గురై ప్రాణాలు వదలడం పట్ల స్థానికులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఒక కుమార్తె ఉన్నారు.

ఆయన మృతి వార్త తెలియగానే తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి రితీష్ రెడ్డి, టిడిపి మున్సిపల్ అధ్యక్షులు గుర్రంపాటి వెంగల్ రెడ్డి, టిడిపి జిల్లా వాణిజ్య విభాగం జనరల్ సెక్రెటరీ ప్రసాద్, సీనియర్ న్యాయవాది ప్రసాద్,రాగిమాను ప్రతాప్ కుమార్, మస్తాన్ బాబు, ఈగ సుబ్బారెడ్డి, ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కొండపల్లి చిన్న సుబ్బారావు, మాజీ మునిసిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, పారిశ్రామికవేత సానపు రెడ్డి రాధాకృష్ణారెడ్డి, మాజీ ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కేవి సుబ్బారావు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ సాయి కృష్ణ, దర్శి సుబ్రహ్మణ్యం, సగల సుబ్బరాజ, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కొలిశెట్టి నాగరాజా, జొన్నలగడ్డ సుధాకర్, డాక్టర్ దిలీప్ గుప్తా, సముద్రాల భరత్, సురేష్ తోపాటు పలువురు ఆర్యవైశ్య సంఘ ప్రముఖులు, రాజకీయ నాయకులు, పట్టణ ప్రజలు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రశేఖర్ చేసిన సామాజిక సేవలను, వ్యాపార రంగంలో ఆయన పాటించిన విలువలను కొనియాడారు. వారి కుటుంబ సభ్యులకు తమ గాఢ సానుభూతిని తెలియజేశారు.

మృతుని అంత్యక్రియలు రేపు (ఆదివారం) ఉదయం 11 గంటలకు మైదుకూరు రోడ్డులోని 'అన్న క్యాంటీన్' ఎదురుగా ఉన్న వారి స్వగృహం నుండి ప్రారంభమై జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.





# అమ్మవారి దేవస్థానంలో పూజలు నిర్వహించిన మంత్రి గొట్టిపాటి రవికుమార్



**(షణ్ముఖ వెలుగు, కొరిశపాడు, మే 2)**

మండలంలోని అనమనమూరు గ్రామంలో వెంచేసి ఉన్న శ్రీ అంకమ్మ తల్లి దేవస్థానాన్ని శనివారం రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సందర్శించారు. తొలుత మాజీ జెడ్పిటిసి సభ్యురాలు జంపు రావమ్మ ఆదిశేషు, వారి కుమారుడు సర్పంచుల సంఘం అధ్యక్షులు జంపు హరిబాబులు మంత్రికి ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ అమ్మవారి దేవస్థానంలో ప్రత్యేక పూజలు జరిపారు. వేద పండితులు ఆయనను ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా అంకమ్మ తల్లి గుడి విశిష్టత గురించి జంపు హరిబాబు మంత్రి రవికుమార్ కు వివరించారు. అనంతరం బీసీ కమ్యూనిటీ హాల్ ను మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ హాల్ సౌకర్యం కల్పించిన మంత్రి రవికుమార్ కు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు సత్యనారాయణ, టిడిపి సీనియర్ నాయకులు రవ్వవరపు బ్రహ్మయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పదవ తరగతి ఫలితాలలో ఎస్ఎల్‌విఎం విద్యార్థుల ప్రభంజనం

## విద్యాసంస్థ కరస్పాండెంట్ గాజులపల్లి శంకర్‌రెడ్డి అభినందనలు





(షణ్ముఖ వెలుగు, బద్వేల్, మే 2)

2026 విద్యా సంవత్సరం పదవ తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాలలో బద్వేల్ పట్టణంలోని శ్రీ లక్ష్మీ విద్యారణ్య మహర్షి (ఎస్.ఎల్.వి.యం) ఉన్నత పాఠశాల విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ కనబరిచి ప్రభంజనం సృష్టించారు. పాఠశాలకు చెందిన బి.వి. జయంత్ శ్రావణ్ 593 మార్కులు సాధించి పాఠశాల స్థాయిలో ప్రథమ స్థానంతో పాటు, పట్టణ స్థాయిలో ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. అలాగే ఎన్. సరిత 581 మార్కులతో ద్వితీయ స్థానాన్ని, పి. శ్రీలక్ష్మి 570 మార్కులతో తృతీయ స్థానాన్ని పొంది పాఠశాల కీర్తిని చాటారు.మొత్తం 44మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా, వారిలో 24 మంది 500కు పైగా మార్కులు సాధించడం విశేషం.

ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ గాజులపల్లి శంకర్ రెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల క్రమశిక్షణ, ఉపాధ్యాయుల నిరంతర పర్యవేక్షణ మరియు ప్రణాళికాబద్ధమైన బోధన వల్లే ఈ అద్భుత ఫలితాలు సాధ్యమయ్యాయి. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ, వారిలోని నైపుణ్యాలను వెలికితీసేలా మేము అందిస్తున్న నాణ్యమైన విద్యకు ఈ ఫలితాలే నిదర్శనమన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో పాఠశాల మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహిస్తుందని ఆశిస్తున్నాను. ఈ విజయంలో కీలక పాత్ర పోషించిన ఉపాధ్యాయ బృందాన్ని ఆయన కొనియాడారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జ్ సుభాషిణి, ఉపాధ్యాయులు యు.వి. సురేష్ బాబు, లక్ష్మీదేవి, బాల గురవయ్య, నరసింహులు, మల్లికార్జున, సుధా, సూర్య, తదితరులు పాల్గొన్నారు.

# తమ్మినేనికి నివాళు లర్పించిన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర





(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, మే 2)

కనిగిరి పట్టణ మాజీ టీడీపీ అధ్యక్షుడు తమ్మినేని శ్రీనివాసరెడ్డి గుండెపోటుతో శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి ఆయన నివాసానికి చేరుకుని శ్రీనివాసరెడ్డి భౌతిక కాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన మృతి చెందడం పై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీనివాసరెడ్డి మరణం పార్టీకి తీరని లోటన్నారు. టీడీపీ ఒక మంచి నాయకుడిని కోల్పోయిందన్నారు. శ్రీనివాసులు రెడ్డి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. శ్రీనివాసులురెడ్డి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశంపార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రీనివాసరెడ్డి అభిమానులు, బంధుమిత్రులు పాల్గొని శ్రీనివాసరెడ్డికి ఘనంగా నివాళులర్పించారు.

# కందుకూరు మున్సిపాలిటీలో రూ.120 కోట్లతో అభివృద్ధి పనులు

**రాబోయే మూడేళ్లలో ఊహించలేనంత అభివృద్ధి చేస్తా**
**ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు వెల్లడి**
**35 ఏళ్ల క్రితం నిర్మించిన కాలువలు, రోడ్ల స్థానంలో కొత్త నిర్మాణాలు**
**రూ.1.91 కోట్లతో సిసి రోడ్ల నిర్మాణానికి**
**శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే ఇంటూరి**










(షణ్ముఖ వెలుగు, కందుకూరు, మే 2)

కందుకూరు పట్టణంలో 35 సంవత్సరాల క్రితం నిర్మించిన డ్రైనేజీ కాలువలు, అనేక రోడ్లు ప్రస్తుతం శిధిలావస్థలో ఉన్నాయి. వాటి స్థానంలో కొత్తవి నిర్మించే పనులు మొదలుపెట్టాం. మున్సిపాలిటీ సంపూర్ణ అభివృద్ధిని ప్రజల కోరుకుంటున్నారు. అందుకు తగినట్టుగానే, కందుకూరు చరిత్రను మార్చేలా ఒక ప్రణాళిక ప్రకారం ముందుకు వెళుతున్నామని స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. కందుకూరులోని పలు వార్డులలో రూ.1.91 కోట్ల నుడా నిధులతో చేపట్టబోయే జజ రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే నాగేశ్వరరావు శనివారం సాయంత్రం శంకుస్థాపన చేశారు. అజ్మల్ హుస్సేన్ హాస్పిటల్ వద్ద శిలాఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ తాను ఎమ్మెల్యే అయిన ఈ 22 నెలల కాలంలో, మున్సిపాలిటీ పరిధిలో 120 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం, నెల్లూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ సహకారంతో పనులు జరుగుతున్నాయన్నారు. రాబోయే మూడేళ్లలో ఊహించలేని రీతిలో అభివృద్ధి పనులు జరుగుతాయని, వేగంగా అభివృద్ధి చెందుతున్న మున్సిపాలిటీలలో ఒకటిగా కందుకూరును తీర్చిదిద్దనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. పట్టణంలో డివైడర్లు, సెంట్రల్ లైటింగ్, ప్రధాన రోడ్ల విస్తరణ పనుల్లో ఎక్కడా రాజీ పడడం లేదని, ట్రాఫిక్ సమస్య నుంచి ప్రజలకు విముక్తి కలిగించడానికి ప్రత్యేకంగా





దృష్టిపెట్టి పనులు చేయిస్తున్నట్లు ఎమ్మెల్యే ఇంటూరి చెప్పారు. వ్యాపారులు, పట్టణ ప్రజలు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కే. అనూష, డిఈ గణపతి, పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, రూరల్ అధ్యక్షుడు బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, పట్టణ మాజీ అధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లు, అన్న క్యాంటీన్ చైర్మన్ ఉన్నం కొండలరావు, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధు, రాష్ట్ర ముస్లిం మైనారిటీ సెల్ అధికార ప్రతినిధి షేక్ రఫీ, రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్, నెల్లూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి చదలవాడ కొండయ్య, కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ రూబీ, పార్టీనేతలు కూనం నరేంద్ర, వడ్డెళ్ళ



రవిచంద్ర, మురారిశెట్టి సుధీర్, కోట నరసింహం, కొత్త వెంకటేశ్వర్లు, శ్రీకాంత్, కంకణాల వెంకటేశ్వర్లు, తాతా లక్ష్మీనారాయణ, గుర్రం అల్లూరయ్య, ఇమ్మడిశెట్టి సుబ్బారాయుడు, పబ్బిశెట్టి రాజా, ఇస్కాల మధు, గొల్ల శ్రీను, అనుమాలశెట్టి శ్రీకాంత్, ఇస్కాల మురళి, మురారిశెట్టి వెంకటేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ సలాం, నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షుడు షేక్ మున్నా, నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు కల్లూరి శైలజ, నియోజకవర్గ తెలుగు ప్రొఫెషనల్ వింగ్ అధ్యక్షురాలు పువ్వాడి మౌనిక, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు ముచ్చు శ్రీను, పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు సవిడిబోయిన వెంకటకృష్ణ, అశ్విని, కాంట్రాక్టర్ గొంది నరసింగరావు, కాకుమాని మాల్యాద్రి, తెల్లప్రోలు రామకృష్ణ, దండే శ్రీను, పలు వార్డుల అధ్యక్షులు, అనుబంధ సంఘాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే బి ఎన్ విజయ్ కుమార్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 2)

ఒంగోలులోని మంగమూరు రోడ్డు మర్రిచేట్టు దగ్గర సంతనూతలపాడు ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజురైనా 26 మందికి 12,10,702 లక్షల రూపాయల చెక్కులను ఎమ్మెల్యే బి ఎన్ విజయ్‌కుమార్ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని నాయకులు, మద్దిపాడు మండల సీనియర్ టిడిపి నాయకులు పోతినేని శ్రీనివాసరావు (పి.యస్.ఆర్), తదితరులు పాల్గొన్నారు.





On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com